సాక్షి
ఆదిలాబాద్

బుధవారం । 26 । ఫిబ్రవరి । 2025



సాలెవాడలో నేడు శివుని విగ్రహావిష్కరణ

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ మండలం సాలెవాడ శివాలయం సమీపంలోని కొండపై ఏర్పాటు చేసిన 21 అడుగుల శివుని విగ్రహాన్ని నేడు ఆవిష్కరించనున్నారు. మహాశివ రాత్రి పురస్కరించుకుని కార్యక్రమం చేపడుతున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రవీందర్ తెలిపారు.

21 అడుగుల శివుని విగ్రహం



కైలాస్‌టెకిడిలోని నర్మదేశ్వరుడు

హరహర మహాదేవ

- శివరాత్రికి ముస్తాబైన ఆలయాలు
- పలుచోట్ల మొదలైన భక్తుల పూజలు



నర్మదేశ్వర ఆలయం ఎదుట బారులు తీరిన భక్తులు

కైలాస్‌టెకిడిలో.. నర్మదేశ్వరుడు

- బోథ్ మండలంలోని నిగిని గ్రామ పరిధిలో గల దట్టమైన అడవిలో కైలాస్‌టెకిడి ఆలయంలో కొలువుదీరిన శివుడు నర్మదేశ్వరుడిగా ప్రసిద్ధి. శివరాత్రికి నాలుగు రోజుల ముందు నుంచే భక్తులు ఇక్కడికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు.

చరిత్ర ఇది..

- 22 ఏళ్ల క్రితం ఈ కొండపై లింబాజీ మహారాజ్‌కు రాతి శివలింగం లభ్యమైంది. ఆ వెంటనే ఆయన పూజలు ప్రారంభించి రాతితో గుడి కట్టాలని సంకల్పించారు. సమీప గ్రామాల ప్రజలు కూడా తోడ్పాటు అందించడంతో ఈ ఆలయం రూపుదిద్దుకుంది. ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు ఇక్కడికి భారీగా తరలివస్తారు.

ఆదిలాబాద్‌టౌన్/బోథ్/తాంసి/బేల/నేరడిగొండ / ఇచ్చోడ: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని జిల్లాలోని శైవక్షేత్రాలు సర్వాంగ సుందరంగా ముస్తాబ య్యాయి. ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. జిల్లా కేంద్రంలోని గంగపుత్ర శివాలయం, భోరజ్‌లోని ప్రాచీన రామలింగేశ్వర ఆలయం, కోర్టాలోని ఓంకారేశ్వర ఆలయం,బోథ్‌లోని కైలాస్‌టెకిడి ఆలయం, సిరి కొండ మండలం కొండాపూర్ శివాలయం, తలమడుగు మండలంలోని ఝరి శ్రీరాజరాజేశ్వర ఆలయాలు ప్రత్యేకతను చాటుకుంటున్నాయి.

- కోర్టాలోని పెన్‌గంగ ఉత్తరవాహినికి ప్రవహించడంతో కాశీ క్షేత్రంగా భావించి భక్తులు ఇక్కడ పుణ్యస్నానాలు ఆచరిస్తుంటారు.
- భోరజ్‌లోని పెండల్‌వాడలో, తాంసి మండలం వడ్డాడిలోని పురాతన స్వయంభూ లింబాద్రిలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఏటా జాతర నిర్వహిస్తారు.



కొండాపూర్ శివాలయం వద్ద ఏర్పాట్లు

- సిరికొండ మండలం కొండాపూర్ శివారులో ఉన్న ప్రాచీన శివాలయం వద్ద ఏటా గోండి భాషలో రామాయణ నాటిక ప్రదర్శిస్తారు.
- బేల మండలం బాది గ్రామ శివారులోని నందీశ్వర ఆలయం శాతవాహనుల కాలంలో నిర్మించినట్లు చెబుతుంటారు. ఈ నందీశ్వరుని మొక్కితే కోరిన కోరికలు తీరుతాయని భక్తుల నమ్మకం.
- కుంటాల జలపాతం వద్ద గుహలో కొలువుదీరిన సోమేశ్వరుని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివస్తారు.
- తలమడుగు మండలం ఝరి గ్రామంలో గల పురాతన రాజరాజేశ్వర శివాలయం వేములవాడ ఆలయం నాటిదిగా చెబుతుంటారు. జాతర సందర్భంగా ఇక్కడ క్రికెట్, వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహిస్తుంటారు.

ఆయా ఆలయాల్లో బుధవారం రాత్రి జాగరణ అనంతరం గురువారం మహాన్నదానాలు ఉంటాయని ఆలయ కమిటీలు వెల్లడించాయి.



భోరజ్‌లో ముస్తాబైన రామలింగేశ్వర ఆలయం



బేల: బాదిలో నందీశ్వర ఆలయం..



కోర్టాలోని ఓంకారేశ్వర ఆలయం



ఆదిలాబాద్‌లో రాజరాజేశ్వర ఆలయం

న్యూస్‌రీల్

యూ-డైస్‌లో తప్పులు లేకుండా నమోదు చేయాలి



ప్రక్రియ పరిశీలిస్తున్న డీఈవో ప్రణీత

ఆదిలాబాద్‌టౌన్: యూ-డైస్‌లో తప్పులు దొర్లకుండా వివరాలు నమోదు చేయాలని డీఈవో ప్రణీత అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో నిర్వహిస్తున్న యూ-డైస్‌ను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని అంశాలకు సంబంధించి తుది నిర్ధారణ చేయాలని ఎంఐఎస్ కోఆర్డినేటర్, డాటాఎంట్రీ ఆపరేటర్, సీఆర్పీలను ఆదేశించారు. ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, పెండింగ్‌లో ఉంచవద్దని సూచించారు. ఆమె వెంట సెక్టోరియల్ అధికారులు నారాయణ, సుజాత్‌ఖాన్, ఉస్మానొద్దీన్, శ్రీకాంత్ గౌడ్, తదితరులున్నారు.

ముగిసిన పోస్టల్ బ్యాలెట్ గడువు

కైలాస్‌నగర్:ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్ వినియోగ గడువు మంగళవారంతో ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 105 మంది పట్టభద్రుల ఓటర్లకు గాను 79 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రంలో తొలిరోజున 62 మంది, చివరి రోజున 15 మంది ఓటుహక్కు వినియోగించుకున్నట్లు అధికారులు వెల్లడించారు.

మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు

ఆదిలాబాద్‌టౌన్: వేసవిలో మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆ శాఖ ఎస్‌ఈ జేఆర్‌చౌహాన్ తెలిపారు. కార్యాలయంలోని తన చాంబర్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వేసవిలో లోడ్ పెరిగే అవకాశం ఉన్నచోట అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 82 కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుతో పాటు 10 ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచినట్లు పేర్కొన్నారు. సబ్‌స్టేషన్లలో సూక్ష్మ లోపాలు గుర్తించేందుకు థర్మల్ ఇమేజింగ్ కెమెరాలు వాడుతున్నట్లు తెలిపారు.

ఉపాధి.. సందిగ్ధం

- సీసీ రోడ్ల నిర్మాణంలో తర్జనభర్జన
- పనులు దక్కించుకున్నా మరూ చేయలే
- గతేడాది వర్క్స్‌కే ఇంకా అందని బిల్లులు
- గడువులోపు పూర్తవడం అనుమానమే..

బజార్‌హత్నూర్ మండల కేంద్రంలోని యాదవ కాలనీలో ఇటీవల మంజూరైన సీసీ రోడ్డు ఇది. రూ.5లక్షల అంచనా వ్యయంతో ఉపాధి హామీ నిధులు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్ ఇటీవల లెవలింగ్ పనులు ప్రారంభించాడు. సీసీ పనులు చేపట్టాల్సి ఉంది. అయితే జిల్లాలోని పలు మండలాల్లో వందలాది పనులు మంజూరైనా ప్రారంభానికి నోచుకోకపోవడం లేదు. కారణం లేకపోలేదు. ప్రధానంగా గతేడాది పనులకు సంబంధించిన బిల్లులే ఇంకా మంజూరు కాకపోవడంతోనే పలువురు తర్జనభర్జన పడుతున్నట్లు తెలుస్తోంది.



- బోథ్ నియోజకవర్గంలోని ఓ మండలకేంద్రంలో కాంగ్రెస్ నేత గతేడాది రూ.12లక్షలతో సీసీ రోడ్డు పని దక్కించుకుని నిర్మాణం పూర్తి చేశాడు. అప్పట్లో వర్క్‌కు సంబంధించి ఎంబీలో వివరాల నమోదు కొంత ఆలస్యం కావడంతో ఇప్పటివరకు ఆ నిధులు మంజూరు రాలేదు. అధికారులను సంప్రదిస్తే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత వస్తాయని చెప్పారు. ఇతనొక్కడే కాదు.. గతేడాది పనులు చేపట్టిన వారిలో చాలా మందిది ఇదే పరిస్థితి.

సీసీ రోడ్ల పనుల వివరాలు..
జిల్లాలో మంజూరైన పనులు: 688
అంచనా వ్యయం : 32.89 కోట్లు
నిధులు: ఉపాధి హామీ మెటీరియల్ కంపోనెంట్
గడువు : మార్చి 31

సాక్షి,ఆదిలాబాద్: ఏటా వార్షిక సంవత్సరం ముగింపునకు చేరువులో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో 40 శాతం మెటీరియల్ కంపోనెంట్ ద్వారా నిర్మించే సీసీ రోడ్ల సందడి అన్ని గ్రామాల్లో కనిపిస్తోంది. ఈసారి కూడా అదే పరిస్థితి. ఈ పనులకు సంబంధించి నెల క్రితమే ప్రొసీడింగ్ వెలువడ్డాయి. వర్క్స్ కూడా నామినేషన్ పద్ధతిపై కేటాయించారు. అయితే పనులు ప్రారంభించే విషయంలో కాంట్రాక్టర్లు తర్జనభర్జన పడుతున్నారు. దీనికి కారణం లేకపోలేదు. గతేడాది చేపట్టిన పనులకు సంబంధించి ఇప్పటివరకు బిల్లులు రాకపోవడమే. ఈ నేపథ్యంలో చేపట్టాలా.. వద్దా అనే సందిగ్ధంలో ఉన్నారు.

కోట్ల నిధులతో పనులు..

ఉపాధి హామీ పథకంలో ఏడాది మొత్తంలో లేబర్ వేజ్ కంపోనెంట్ కింద ఎంతైతే ఖర్చుపెట్టడం జరుగుతుందో, అందులో 40 శాతం మెటీరియల్ కంపోనెంట్ కింద ఆర్థిక సంవత్సరం చివరలో పనులు కేటాయిస్తున్నారు. తద్వారా 60 శాతం లేబర్‌వేజ్ కంపోనెంట్, 40 శాతం మెటీరియల్ కంపోనెంట్ కింద పరిగణలోకి తీసుకుంటున్నారు. ఇందులో సీసీ రోడ్లు, గ్రామపంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, పాఠశాలల్లో టాయిలెట్స్ వంటి నిర్మాణాలు చేపట్టేందుకు అవకాశం ఉంటుంది. అయితే సీసీ రోడ్ల పనులనే ఏటా తీసుకోవడం, వాటిని నామినేషన్ పద్ధతిలో నేతలు, నాయకులకు అప్పగించడం ఆనవాయితీగా మారింది. ఈ ఏడాది కూడా రూ. కోట్ల విలువైన పనులు జిల్లాలో మొదలయ్యాయి. కాగా మార్చి 31లోగా ఈ పనులను పూర్తి చేయాలి. ఆ గడువులోపే ఎంబీలో నమోదు కావాలి. అలాంటప్పుడే బిల్లులు వచ్చే పరిస్థితులు ఉన్నాయి. లేనిపక్షంలో ఆ పనికి సంబంధించి రికార్డు నమోదైనా దాన్ని పంపించడంలో ఆలస్యమయ్యే పరిస్థితి ఉంటుంది. దీంతోనే బిల్లుల రాకలో ఆలస్యమవుతుందన్న అభిప్రాయ అధికార వర్గాల్లో వ్యక్తమవుతుంది. ఈ నేపథ్యంలోనే ఈ పనుల ప్రారంభం, పూర్తి చేయడం విషయంలో ఫిబ్రవరి, మార్చిలో ఇటు అధికారులు, అటు ప్రజాప్రతినిధుల పరంగా క్షేత్రస్థాయిలో సందడి కనిపిస్తోంది. అయితే ఈ ఏడాది పలు గ్రామాల్లో ఇంకా పనులు మొదలు కాలేదు.

అన్ని పార్టీల నేతలకు..

ఈ పనుల పంపకాల పరంగా జిల్లాలో చిత్రమైన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రధానంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికి జిల్లాలో పరిశీలిస్తే.. ఆదిలాబాద్ నియోజకవర్గంలో బీజేపీ, బోథ్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్, ఖానాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ పనుల కేటాయింపు పరంగా వివాదం తలెత్తే పరిస్థితి ఉంటుంది. ప్రధానంగా అధికార కాంగ్రెస్ పార్టీలో పలువురు ఈ పనులను ఆశిస్తారు. ఈ నేపథ్యంలో మంత్రి సీతక్క కోటాలో ఎమ్మెల్యే ప్రాతినిధ్యం లేని నియోజకవర్గాల్లో ఆ ఇన్‌చార్జీల ద్వారా పనులు కేటాయించారు. అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్య నేతలకు కూడా అనేక పనులు కేటాయించారు. ఇక ఎమ్మెల్యేలకు కూడా కేటాయించడం, మరోపక్క ఎంపీ తన కోటాలో అనేక పనులను కార్యకర్తలకు కేటాయించారు. దీంతో ఈ పనుల పంపకాల విషయంలోఇప్పటివరకై తే ఎలాంటి గొడవలు కనిపించలేదు.

40 శాతం పనులు మొదలు..



గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి సంబంధించి ఇప్పటివరకు 40 శాతం పనులు మొదలయ్యాయి. కనిష్ఠంగా రూ.2లక్షల నుంచి గరిష్ఠంగా రూ.20 లక్షల వరకు అంచనా వ్యయంతో నిర్మిస్తున్నాం. గడువులోగా పూర్తి చేస్తాం.

– రాథోడ్ శివరాం, ఈఈ, పంచాయతీరాజ్

పీఆర్ పర్యవేక్షణలోనే..



ఉపాధి హామీలో 40 శాతం మెటీరియల్ కంపోనెంట్ కింద సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నాం. అయితే ఈ పనులను పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షిస్తుంది. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఈ పనుల పరంగా సమన్వయం చేయడం వరకే బాధ్యత.

– రాథోడ్ రవీందర్, డీఆర్డీవో

ఎన్నికల జాగారం

- శివరాత్రి తెల్లారే ఎమ్మెల్సీ పోలింగ్
- పట్టభద్రులు, టీచర్ అభ్యర్థుల ఆరాటం
- ప్రచారం ముగిసి తెరవెనుక మంత్రాంగం

ఎమ్మెల్సీ ఓటర్ల వివరాలు
పట్టభద్రులు : 3,55,159
టీచర్లు : 27,088

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మెదక్-కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఘట్టం తుది అంకానికి చేరుకుంది. పోలింగ్‌కు 48గంటల ముందే ప్రచారం నిలిపి వేయాల్సి ఉండడంతో తెరవెనుక అభ్యర్థుల మంత్రాంగం మొదలైంది. నాలుగు పాత జిల్లాల్లోని మొత్తం 42అసెంబ్లీ స్థానాల పరిధిలో జరుగుతున్న పట్టభద్రుల, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలపై ఈసారి సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. పోటీలో ఉన్న వారంతా గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో ఓటర్ల మొగ్గుపై ఆసక్తి కొనసాగుతోంది. తమ అభ్యర్థుల విజయం కోసం ఆయా పార్టీల రాష్ట్ర అగ్రనాయకత్వం ప్రచారాన్ని హోరెత్తించింది. గతంతో పోల్చితే ఈసారి మరింత దూకుడుగా అభ్యర్థులు తలపడుతున్నారు. ప్రచారంలో ఒకరిని మించి మరొకరు హామీలు ఇస్తూ ఓటర్లకు చేరువయ్యే ప్రయత్నం చేశారు. నేడు శివరాత్రి పండుగ ముగిసి, గురువారం ఉదయం 8నుంచే బ్యాలెట్ పేపర్‌పై ప్రాధాన్యత క్రమాన్ని ఓటర్లు వేయడం మొదలవుతుంది. దీంతో అభ్యర్థులు ఎన్నికల జాగారం చేయాల్సి వస్తోంది.

టీచర్ల స్థానానికి హోరాహోరీ

ఉపాధ్యాయ స్థానానికి మొత్తం 15మంది బరిలో ఉండగా, ఇందులో బీజేపీ నుంచి మల్క కొమురయ్య, పీఆర్టీయూ టీఎస్ నుంచి వంగ మహేందర్‌రెడ్డి, తాజా మాజీ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, ఉమ్మడి జిల్లా నుంచి ఉపాధ్యాయ సంఘాల్లో చురుగ్గా ఉన్న పీఆర్‌టీయూ ఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు, టీఎస్‌సీపీఎస్‌ఈ యూనియన్ బలపర్చిన తిరుమల్‌రెడ్డి ఇన్నారెడ్డితో సహా స్వతంత్ర అభ్యర్థులు బరిలో ఉన్నారు. సీపీఎస్ రద్దు, 317 జీవో, డీఏలు మెడికల్ రీయింబర్స్‌మెంట్స్ పెండింగ్, పేస్కేల్, పదోన్నతుల సమస్యలే ప్రచారంలో చర్చకు వచ్చాయి. అందరూ హామీలే ఇచ్చినప్పటికీ టీచర్లు ఎవరికి పట్టం కడుతారనే ఆసక్తి నెలకొంది. గతంలో మద్దతు తెలిపిన సంఘ సభ్యులందరూ ఒకే అభ్యర్థికి ఓట్లు వేసిన దాఖలాలు లేవు. చాప కింద నీరులా కొందరు అభ్యర్థులు తెరవెనుక మంత్రాంగం నడిపించి ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు వ్యూహాత్మకంగా వెళ్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఆయా ఓటర్లకు తాయిలాలు అందే ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇంకా విందులు నడుస్తున్నాయి.

పట్టభద్రుల అభ్యర్థులు



నరేందర్ రెడ్డి



అంజిరెడ్డి



ప్రసన్న హరికృష్ణ



బక్క జడ్సన్

టీచర్ల అభ్యర్థులు




మల్క కొమురయ్య



వంగ మహేందరెడ్డి



తిరుమల్‌రెడ్డి ఇన్నారెడ్డి



కూర రఘోత్తంరెడ్డి

పట్టభద్రుల ప్రసన్నం కోసం

కాంగ్రెస్ పార్టీ నుంచి నరేందర్‌రెడ్డి, బీజేపీ మద్దతుతో అంజిరెడ్డి, బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణతో సహా మొత్తం 56మంది బరిలో ఉన్నారు. తమ అభ్యర్థులను గెలిపించుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సహా రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు స్థానిక నాయకులు చెమటోడుస్తున్నారు. బీజేపీ నుంచి కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌తో సహా ఎమ్మెల్యేలు, ఎంపీలు, నాయకులు ప్రచారం చేశారు. బీఎస్పీ నుంచి పోటీలో ఉన్న ప్రసన్న హరికృష్ణ బీసీ నినాదంతో ముందుకు వస్తున్నారు. వీరితోపాటు బక్క జడ్సన్ పలువురు స్వతంత్ర అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఇప్పటికే బహిరంగ సభలు, సమావేశాలు, ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. అంతేకాక ఎవరికివారు సామాజిక మాధ్యమాలు, ఫోన్లు, మెసేజ్‌లు, వాట్సాప్‌ల్లో జోరుగా ప్రచారం నిర్వహించారు. ప్రధానంగా ముగ్గురి మధ్యే పోటీ నెలకొనడంతో పట్టభద్రులు తమ ప్రాధాన్యతను ఎలా వ్యక్తపరుస్తారనేది ఆసక్తిగా మారింది. ఓటర్ల ప్రసన్నం కోసం చివరి అస్త్రంగా నగదు పంపిణీకి ఏర్పాట్లు జరుగుతున్నట్లు సమాచారం.

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: మార్చి 5నుంచి నిర్వహించనున్న ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా 18,880 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానుండగా 31 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షల సమయానికి అనుగుణంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. అలాగే పరీక్ష సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలన్నారు. ఆయా కేంద్రాల పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్లను మూసివేయించాలన్నారు. సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమలుతో పాటు బందోబస్తు, తదితర ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లను అనుమతించేది లేదని స్పష్టం చేశారు. కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేపట్టాలన్నారు. ఆయాశాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఇందులో డీఎస్పీ జీవన్‌రెడ్డి, డీఐఈవో రవీందర్ కుమార్, డీఈవో ప్రణీత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

నీటి ఎద్దడి తలెత్తకుండా శ్రద్ధ వహించాలి

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా శ్రద్ధ వహించడంతో పాటు ఎప్పటికప్పుడు నివేదికలు అందజేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. కలెక్టరేట్ నుంచి ఆయా శాఖల అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాగునీటి ఎద్దడి తలెత్తకుండా సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. ఎక్కడెక్కడ మరమ్మతులు అవసరమున్నాయో గుర్తించాలన్నారు. అలాగే ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్న వివరాలు కూడా నివేదిక రూపంలో అందించాలన్నారు. సీఎం ప్రజావాణి కింద జిల్లాలోని అన్ని ఎంపీడీవో కార్యాలయాల్లో ఫెసిలిటీస్ సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి రోజూ దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. ఇందులో జెడ్పీసీఈవో జితేందర్‌రెడ్డి తదితరులుపాల్గొన్నారు.

బీజేపీలో పంపకాల లొల్లి

- ఎమ్మెల్సీ ఎన్నికల డబ్బుల విషయంలో గొడవ
- పార్టీ జిల్లా అధ్యక్షుడు వర్సెస్ అశోక్ ముస్తపురి

సాక్షి,ఆదిలాబాద్: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బూత్ కమిటీలకు ఇచ్చే డబ్బుల విషయంలో బీజేపీలో గొడవ చోటు చేసుకుంది. జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్, ఆ పార్టీ నాయకుడు అశోక్ ముస్తపురి మధ్య జరిగింది. మంగళవారం ఇచ్చోడలోని ఓ గెస్ట్ హౌస్‌లో బూత్ కమిటీలతో నిర్వహించిన సమావేశంలో ఇది జరిగినట్లుగా చెబుతున్నారు. ఈ ఎన్నికలకు సంబంధించి పార్టీ ఇన్‌చార్జీగా ఉన్న ఓ నేత, పార్లమెంట్ స్థాయిలో ఓ ముఖ్య ప్రజాప్రతినిధి, అశోక్ ముస్తపురి ఈ సమావేశం నిర్వహిస్తుండగా జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్ అక్కడికి చేరుకున్నట్లు చెబుతున్నారు. ప్రధానంగా డబ్బుల పంపకాల విషయంలో జిల్లా అధ్యక్షుడిగా తన ప్రమేయం లేకుండానే వ్యవహారం సాగుతుండడంపై ఆయన అశోక్‌తో గొడవకు దిగినట్లు తెలిసింది. పార్టీలో ఎలాంటి పదవి లేకపోయినా బూత్ కమిటీలకు పంపకాలు ఎలా చేస్తున్నావంటూ అశోక్‌ను బ్రహ్మానంద్ నిలదీసినట్లు సమాచారం. అయితే ఓ ప్రజాప్రతినిధి, పార్టీలో కీలకంగా ఉన్న ముఖ్యనేత ఆదేశాల మేరకే తాను నేరుగా పంపిణీ చేస్తున్నట్లు అశోక్ వివరించినట్లు తెలిసింది. దీంతో ఇరువురి మధ్య తీవ్రస్థాయిలో గొడవ జరిగినట్లు పార్టీలో చెప్పుకుంటున్నారు. ఈ వ్యవహారం తర్వాత ముఖ్యనేతల ఆదేశాల మేరకు బ్రహ్మానంద్ సాయంత్రం ఆదిలాబాద్‌లో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి చేరుకున్నట్టుగా పేర్కొంటున్నారు. ఇదిలా ఉంటే తనపై పార్టీలో జరుగుతున్న వ్యవహారంతో విసిగిపోయినట్లు బ్రహ్మానంద్ ముఖ్య నేతలతో వాపోయినట్లు తెలుస్తోంది.

బూత్ కమిటీలకు పంపకాలు..

ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ పరంగా ఇటు ఉపాధ్యాయ, అటు పట్టభద్రుల నియోజకవర్గాల నుంచి అభ్యర్థులు బరిలో ఉన్న విషయం తెలిసిందే. ఈక్రమంలో బూత్‌కమిటీ స్థాయిలో ఆయా ఓటర్లు బీజేపీ అభ్యర్థులకు ఓటు వేసేలా ప్రచార నిర్వహణ కోసం డబ్బులు పంపిణీ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఒక్కోబూత్‌కు రూ.2వేల వరకు పంపిణీ చేస్తున్నట్లు పార్టీలో చెబుతున్నారు. అయితే బూత్‌కు కనీసం రెట్టింపు డబ్బులు ఇవ్వాల్సి ఉండగా, తగ్గించి ఇస్తున్నారనే ప్రచారం ఉంది. ఈ వ్యవహారంలోనే పార్టీలో గొడవ జరిగినట్లు తెలుస్తోంది. ఈ విషయమై బ్రహ్మానంద్‌ను 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించేందుకు యత్నించగా అందుబాటులోకి రాలేదు.

క్లుప్తంగా

ఆగస్త్యకూడం అధిరోహించిన చెన్నూర్ యువకుడు


ఆగస్త్యకూడం(శిఖరం) ఎక్కిన సూరజ్

చెన్నూర్: పట్టణానికి చెందిన యువకుడు మంచాల సూరజ్.. ఆగస్త్యకూడం (శిఖరం) అధిరోహించాడు. మంచాల రాజబాపు–పద్మజ దంపతుల కుమారుడు సూరజ్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈయన కేరళలోని తిరువనంతపురానికి 60 కి.మీ దూరంలో ఆగస్త్యకూడం(శిఖరం) 50 మీటర్ల ఎత్తును మూడురోజుల్లో ట్రెక్కింగ్‌ను విజయవంతంగా పూర్తి చేశాడు. ఈ ట్రెక్కింగ్ జనవరి నుంచి ఏప్రిల్ వరకు కొనసాగుతుంది. శిఖరానికి ఆగస్త్య మహాముని పేరు పెట్టడంతో ఇది ప్రసిద్ధి చెందిన తీర్థయాత్రగా పేరొంది. యాత్ర చేపట్టేవారికి కేరళ ప్రభుత్వం ఆహార సదుపాయాలు కల్పిస్తోంది. ట్రెక్కింగ్ విజయవంతంగా పూర్తి చేసిన సూరజ్‌ను పట్టణ ప్రజలు అభినందిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

భైంసాటౌన్: పట్టణంలోని భైంసా–నిర్మల్ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. తానూరు మండలం ఎల్వికి చెందిన సాయినాథ్, లక్ష్మణ్ బైక్‌పై నిర్మల్ వైపు నుంచి భైంసా వైపు వస్తున్నారు. స్థానిక సోషల్ వెల్ఫేర్ గురుకుల కళాశాల(పాత సరస్వతి కాలేజీ) వద్ద అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని కిందపడి ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు 108లో ఏరియాస్పత్రికి తరలించారు.

హాజీపూర్‌లో ఇరువురికి..

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలో మంగళవారం రాత్రి జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. హాజీపూర్‌లో మంచిర్యాల వైపు వస్తున్న ఓ ట్రాలీ రోడ్డు దాటుతున్న వృద్ధుడిని ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడు చొప్పదండి మండలం కుర్మపల్లికి చెందిన గొర్రెల కాపరి పెద్ది కొమురయ్యను ఎస్సై సురేశ్ పోలీస్ వాహనంలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. హాజీపూర్ శివారులోని ఓ పైప్‌లైన్ కంపెనీ వద్ద ఆగి ఉన్న సాయి తన బైక్‌లో పెట్రోల్ లేకపోవడంతో రోడ్డుపై నిలిచి ఉన్నాడు. మంచిర్యాల వైపు వెళ్తున్న కర్ణమామిడికి చెందిన కోటె అజయ్ బైక్‌తో వేగంగా ఢీ కొట్టాడు. తీవ్రగాయాలైన అజయ్‌ను ప్రైవేట్ ఆస్పత్రికి అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు.

పెద్దల సభలో..మనోళ్లు

- ఉమ్మడి జిల్లా నుంచి శాసన మండలికి పలువురి ప్రాతినిధ్యం
- ఛైర్మన్‌గా ఆదిలాబాద్‌కు చెందిన సయ్యద్ ముకషీర్ షా
- పి.నర్సారెడ్డి, జీవీ సుధాకర్‌రావు, పలువురు ఎమ్మెల్సీగా
- స్థానికసంస్థలు, ఎమ్మెల్యే కోటాలోనే అవకాశాలు


సయ్యద్ ముకషీర్‌షా | పి.నర్సారెడ్డి | జీవీ సుధాకర్‌రావు | సుల్తాన్ అహ్మద్ | ప్రేమ్‌సాగర్ రావు | పొగాకు యాదగిరి | పురాణం సతీశ్ | దండే విఠల్

సాక్షి,ఆదిలాబాద్: మెదక్–నిజామాబాద్–ఆదిలాబాద్–కరీంనగర్ నియోజకవర్గ పట్టభద్రుల, టీచర్స్ శాసనమండలి సభ్యుల ఎన్నికల వేడి ఈ నాలుగు ఉమ్మడి జిల్లాల్లో ఉంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ఇటు పట్టభద్రుల పరంగా, అటు టీచర్స్ పరంగా ఒకరంటే ఒక్కరికి కూడా అవకాశం దక్కలేదు. పలువురు పోటీ చేసినప్పటికీ నిరాధారణకు గురయ్యారు. అయితే శాసనమండలి పరంగా ఉమ్మడి జిల్లాలో ఘన చరిత్ర ఉంది. ఆదిలాబాద్‌కు చెందిన సయ్యద్ ముకషీర్‌షా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శాసనమండలికి 6వ ఛైర్మన్‌గా వ్యవహరించారు. రెండుసార్లు ఆయన ఛైర్మన్‌గా ఉండటం గమనార్హం. ఆ సమయంలో మర్రి చెన్నారెడ్డి, టి.అంజయ్య, భవనం వెంకట్రాంరెడ్డి, కోట్ల విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఎన్టీ రామారావు, నాదెండ్ల భాస్కర్‌రావు సీఎంలుగా ఉన్నారు.

మనోళ్లు ముఖ్య పదవుల్లో..

ఉమ్మడి జిల్లా నుంచి శాసనమండలి ఛైర్మన్‌గా ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన సయ్యద్ ముకషీర్ షా వ్యవహరించిన ఘనత ఉంది. కాంగ్రెస్ స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి ఒక్కసారి ఎన్నిక చేయగా, మరోసారి శాసన పరిషత్‌కు నామినేట్ అయ్యారు. ఆంధ్రప్రదేశ్ శాసనమండలి 1958లో ఏర్పాటు కాగా, సీఎంగా వ్యవహరించిన ఎన్టీ రామారావు ఈ శాసనమండలి వ్యవస్థను 1985లో రద్దు చేశారు. అప్పుడు మండలి చివరి ఛైర్మన్‌గా ముకషీర్ షా ఉన్నారు. ఆ తర్వాత 2007లో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి రాష్ట్రంలో మళ్లీ శాసనమండలి పునరుద్ధరించారు. నిర్మల్‌కు చెందిన పి.నర్సారెడ్డి మూడుసార్లు ఎమ్మెల్యేగా, కేబినెట్ మంత్రిగా వ్యవహరించారు. శాసన మండలి సభ్యుడిగా ఉన్నారు. ఆ తర్వాత ఎంపీ అయ్యారు. అప్పట్లో ఏపీసీసీ అధ్యక్షుడిగా ఉన్నారు. దండేపల్లికి చెందిన జీవీ సుధాకర్‌రావు ఒకసారి ఎమ్మెల్సీగా వ్యవహరించారు. అప్పటి సీఎం మర్రి చెన్నారెడ్డి మంత్రివర్గంలో భారీ నీటిపారుదల శాఖ మంత్రిగా పనిచేశారు.

స్థానిక సంస్థల నుంచే..

ఉమ్మడి జిల్లా స్థానికసంస్థల నుంచే జిల్లా ముగ్గురు నేతలకు అవకాశం దక్కింది. అందులో కాంగ్రెస్ నుంచి సయ్యద్ ముకషీర్ షా, ప్రేమ్‌సాగర్‌రావులు ఉన్నారు. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్సీగా వ్యవహరించిన పురాణం సతీశ్ పదవీ కాలం పూర్తయ్యే వరకు పార్టీలోనే కొనసాగారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన హస్తం పార్టీలో చేరారు. ప్రస్తుతం అదే పార్టీలో కొనసాగుతున్నారు. 2022లో ఆదిలాబాద్ స్థానిక సంస్థల బీఆర్ఎస్ ఎమ్మెల్సీగా గెలిచిన దండే విఠల్ ఇప్పటికీ పదవిలో కొనసాగుతుండగా ప్రస్తుతం కాంగ్రెస్‌లో ఉన్నారు.

ఎమ్మెల్యే కోటాలో..

ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన వారిలో ఇప్పటివరకు ఇద్దరు మాత్రమే ఉన్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి చెన్నూర్‌కు చెందిన సుల్తాన్ అహ్మద్‌ను మైనార్టీ కోటాలో ఎమ్మెల్సీగా ఎంపిక చేశారు. అంతకుముందు 1999లో ఈయన సిర్పూర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2004లో మళ్లీ టికెట్ ఆశించారు. ఆ సమయంలో కోనేరు కోనప్పకు కాంగ్రెస్ అధిష్టానం టికెట్ ఇవ్వగా, సుల్తాన్ అహ్మద్‌కు నామినేట్ పదవి విషయంలో భరోసానిచ్చారు. ఈమేరకే అప్పట్లో ఎమ్మెల్సీగా ఎన్నుకున్నారు. మంచిర్యాలకు చెందిన పొగాకు యాదగిరి న్యాయవాదిగా వ్యవహరించేవారు. ఎన్టీ రామారావు హయాం నుంచి టీడీపీలో ఉన్నారు. చంద్రబాబు ఆయనకు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చారు. వీరిద్దరు మినహా ఎవరు కూడా ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించలేదు.

ఉమ్మడి జిల్లా నుంచి ఎమ్మెల్సీలు

1.సయ్యద్ ముకషీర్ షా(మృతిచెందారు). 1979–80, 1981–85 (మండలి ఛైర్మన్), (స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించారు
2.పి.నర్సారెడ్డి (మృతిచెందారు). మూడు సార్లు ఎమ్మెల్యే, కేబినెట్ మంత్రి, ఆ తర్వాత 1981–85 వరకు ఎమ్మెల్సీగా, ఒక సారి ఎంపీగా వ్యవహరించారు.
3.జీవీ సుధాకర్‌రావు (మృతిచెందారు). 1977 (పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించారు).
4.మహ్మద్ సుల్తాన్ అహ్మద్ (మృతిచెందారు), 2007–09 (ఎమ్మెల్యే కోటా నుంచి ప్రాతినిధ్యం వహించారు)
5. ప్రేమ్‌సాగర్‌రావు, 2007–13 (స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించారు.
6. పొగాకు యాదగిరి (మృతిచెందారు). 2007 (ఎమ్మెల్యే కోటా నుంచి ప్రాతినిధ్యం వహించారు)
7. పురాణం సతీశ్, 2015–22 వరకు (స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం)
8. దండే విఠల్.. 2022 నుంచి 2028 వరకు కొనసాగనున్నారు. 'స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం).

జాతర ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే


ట్యాంకును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

జైపూర్: వేలాల జాతర ఏర్పాట్లను చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి మంగళవారం పరిశీలించారు. గుట్టపై భక్తులకు తాగునీటి వసతి, ఆలయం వద్ద సౌకర్యాలు, గోదావరినదిలో పుణ్యస్నానాలు, గుట్టపైకి కాలినడక మార్గంలో వెళ్లేవారికి తాగునీరు, విశ్రాంతి సౌకర్యాలు పరిశీలించి పలు సూచనలు చేశారు. రామగుండం సీపీ శ్రీనివాస్, మంచిర్యాల డీసీపీ భాస్కర్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్, శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ నేతృత్వంలో ముగ్గురు ఏసీపీలు, ఆరుగురు సీఐలు, 30 మంది ఎస్సైలు, 35 మంది ఏఎస్సైలతో పాటు 600 మంది పోలీస్ సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మంచిర్యాల, చెన్నూర్, గోదావరిఖని ప్రాంతాల నుంచి వేలాలకు 100 ఆర్టీసీ బస్సులు కేటాయించారు.

యంత్రాల పనిగంటలు పెంచాలి


ఇన్‌ఫిట్ క్రషర్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న డైరెక్టర్ సూర్యనారాయణ

శ్రీరాంపూర్: ఓపెన్ కాస్ట్ గనిలో భారీ యంత్రాల పనిగంటలు మరింత పెంచాలని సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్) ఎల్వీ.సూర్యనారాయణ తెలిపారు. మంగళవారం ఆయన శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గని సందర్శించారు. ఓసీపీలోని ఇన్‌ఫిట్ క్రషర్, సర్ఫేస్ క్రషర్లను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఓపెన్ కాస్ట్ గని నుంచి ప్రతీరోజు 4రేకుల బొగ్గు రవాణా చేయాలన్నారు. శ్రీరాంపూర్ ఏరియా మొత్తం 7 రేకుల బొగుగ్ రవాణా కావాల్సి ఉందన్నారు. నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జీఎం(సీహెచ్‌పీ) తిరుమల్‌రావు, ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఓసీపీ అధికారి టీ.శ్రీనివాస్, డీజీఎంలు కేశవరావు, రవీందర్, క్వాలిటీ ఇంచార్జి కే.వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రాజెక్ట్ ఇంజినీర్ నాగరాజు పాల్గొన్నారు.

మహిళ మెడలో పుస్తెలతాడు అపహరణ

తానూరు: మహిళ మెడలో పుస్తెల తాడు అపహరించిన ఘటన మండలంలో బోంద్రట్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ కథనం ప్రకారం.. బోంద్రట్ గ్రామానికి చెందిన పంచశీల మంగళవారం వ్యవసాయ పనులకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి తిరిగివస్తుంది. ఈ క్రమంలో ఎదురుగా బైక్‌పై ముసుగు ధరించి వచ్చిన ఇద్దరు దుండగులు ఆమె మెడలో పుస్తెతాడును ఎత్తుకెళ్లి పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువకుడి దారుణహత్య

- తెల్లవారుజామున కత్తితో గొంతుకోసి..
- పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు
- పాత కక్షలే కారణం


రవితేజ (ఫైల్)


రిమ్స్‌లోని మార్చురీ వద్ద మృతుడి కుటుంబీకులు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్ రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాకేంద్రంలో యువకుడు దారుణహత్యకు గురయ్యాడు. ముగ్గురు కత్తితో ఆయన గొంతు కోసి పొడిచి చంపిన ఘటన మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని క్రాంతినగర్‌కు చెందిన కొమ్మవార్ రవితేజ (26) డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఏడాది క్రితం భోరజ్ మండలానికి చెందిన ప్రవళికతో వివాహమైంది. రవితేజ చిన్న వయస్సులోనే తండ్రి వదిలిపెట్టి మరో వివాహం చేసుకున్నాడు. ఏడేళ్ల క్రితం తల్లి భాగ్యశ్రీ మృతిచెందింది. కాగా రవితేజ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సోమవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అర్ధరాత్రి దాటిన తిరిగిరాలేదు. పట్టణంలోని ఇందిరానగర్ దత్త మందిర్ సమీపంలో ముగ్గురు యువకులు గోల్డెన్ కార్తీక్, సిద్ధూ, సాయికిరణ్ ఆతన్ని కత్తితో పొడిచి హత్య చేశారు. ఈ విషయం మృతుడి భార్యకు స్థానికులు తెలియజేయడంతో ఆమె ఘటన స్థలానికి చేరుకుంది. రక్తపు మడుగులో పడి ఉన్న భర్తను చూసి కన్నీరుమున్నీరైంది. మూడు రోజుల క్రితం ముగ్గురు యువకులతో రవితేజకు గొడవలు జరిగాయి. తమ గ్యాంగ్‌తో కలిసి ఉండాలని తన భర్తను హెచ్చరించినట్లు మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. పాత కక్షలతోనే హత్య చేసినట్లు ఆమె పేర్కొంది. పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఆరు గంటల్లోనే కేసు ఛేదించాం: డీఎస్పీ

గ్యాంగ్‌లు నిర్వహించడంతోపాటు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ యువకుడిని హత్య చేసిన కేసును ఆరు గంటల్లోనే ఛేదించి నిందితులను అరెస్టు చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి తెలిపారు. మంగళవారం రాత్రి టూటౌన్ పోలీసుస్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి కత్తి, మూడు సెల్‌ఫోన్లు, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితులు నేరాలకు పాల్పడుతూ తమతో కలిసి తిరగాలని రవితేజకు చెప్పినా నిరాకరించడంతో హత్యకు ఒడిగట్టినట్లు చెప్పారు. నిందితులు సోమవారం రాత్రి మద్యం తాగి పేకాట ఆడిన తర్వాత ఇందిరానగర్‌లో మరోసారి మద్యం తాగుతున్న సమయంలో రవితేజ బైక్‌పై వెళ్తుండగా అడ్డగించి కత్తితో దాడికి పాల్పడినట్లు పేర్కొన్నారు. ఏ–1గా చిల్కూరి లక్ష్మీనగర్‌కు చెందిన గోల్డెన్ కార్తీక్, ఏ–2, ఏ–3గా ఇందిరానగర్‌కు చెందిన సిద్ధూ, దేవుల సాయికిరణ్‌లు ఉన్నట్లు తెలిపారు. ఏ–1, ఏ–2తోపాటు మృతుడిపై పలు కేసులు ఉన్నట్లు పేర్కొన్నారు. వీరిపై రౌడీ షీటర్లు ఓపెన్ చేస్తున్నట్లు తెలిపారు. ఎవరైన కత్తులతో ఫొటోలు దిగుతూ నేరాలను ప్రేరేపించేలా సోషల్‌మీడియాలో ఫొటోలు, వీడియోలు పోస్టుచేస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. హత్య చేసిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసి ఆరుగంటల్లోనే కేసును ఛేదించిన పోలీసులను డీఎస్పీ అభినందించారు. సమావేశంలో టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు, వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్, టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో చికిత్స పొందుతూ మహారాష్ట్రకు చెందిన యువకుడు మంగళవారం మృతిచెందినట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. యవత్మాల్ జిల్లాలోని ధగడ్‌లాల్ గ్రామానికి చెందిన సట్పుటే దత్తు (22) గత కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తితో ఉమర్‌ఖేడ్ తాలుకాలోని కొర్ట గ్రామంలో బంధువుల పంట చేనులో ఈనెల 22న పురుగుల మందు తాగాడు. గమనించిన బంధువులు అతన్ని రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు.

చోరీకి పాల్పడ్డ దొంగ అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల చోరీకి పాల్పడిన దొంగను అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పట్టణంలోని శాంతినగర్‌లో ఈనెల 8న తుమ్మల విజయ ఇంట్లో చోరీ జరిగింది. రూ.5వేల నగదు అపహరణకు గురైంది. బాధితురాలు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. పట్టణంలోని నేతాజీ చౌక్‌లో మంగళవారం అనుమానాస్పదంగా తిరుగుతున్న షేక్ తబ్రేజ్‌ను విచారించగా చోరీకి పాల్పడినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

ఇంట్లో చోరీ

తానూరు: మండలంలోని భోసి గ్రామంలో చాదల దత్తాత్రి ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై శ్రీనివాస్ కథనం ప్రకారం.. సోమవారం రాత్రి దత్తాత్రి ఇంట్లో నిద్రించాడు. భార్య గోదావరి మరో గదికి తాళం వేసి గ్రామంలో నిర్వహించిన భజన కార్యక్రమానికి వెళ్లి మంగళవారం వేకువజామున వచ్చింది. గదికి వేసిన తాళం పగిలిపోయి ఉంది. లోపలికి వెళ్లి చూసేసరికి బీరువా తాళం, గల్లగురిగి ధ్వంసమై కనిపించాయి. శనగ పంట విక్రయించిన రూ.36 వేలు, గల్లగురిగిలో పోగుచేసిన రూ.20 వేలను దుండగులు ఎత్తుకెళ్లారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కోతుల దాడిలో మహిళకు గాయాలు

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్‌కు చెందిన మమతపై మంగళవారం కోతుల దాడి చేసి గాయపర్చింది. సోమవారం రాత్రి కుక్కల దాడిలో ఆశల లచ్చన్న, చిన్నారి వేదశ్రీకి గాయాలయ్యాయి. పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన ఓ మహిళపై కోతులు దాడి చేసి గాయపర్చింది.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య


క్రాంతి (ఫైల్)

బెల్లంపల్లి: మద్యానికి బానిసై జల్సాల కోసం అప్పు చేసిన యువకుడు తీర్చేమార్గం లేక రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బెల్లంపల్లి జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వర్ కథనం ప్రకారం.. కాసిపేట మండల కేంద్రానికి చెందిన దుర్గం క్రాంతి (29) జులాయిగా తిరిగేవాడు. అడపాదడపా మంచిర్యాలకు చెందిన ఓ రియల్టర్ వద్ద డ్రైవర్‌గా పనిచేస్తూ తెలిసిన వారి వద్ద అప్పులు చేసి మద్యం తాగేవాడు. అవివాహితుడైన క్రాంతి నెలక్రితం తల్లి దుర్గం వెంకటమ్మను బతిమిలాడటంతో ఆమె రూ.10 వేలు వేరే వ్యక్తుల వద్ద అప్పు అడిగి ఇచ్చింది. ఆ డబ్బులను తాగుడుకు ఖర్చు చేశాడు. మరోపక్క అప్పు ఇచ్చిన వారు అడగడంతో తప్పించుకు తిరుగుతున్నాడు. అప్పు తీర్చేమార్గం లేక క్రాంతి సోమవారం అర్ధరాత్రి సుబ్బారావుపల్లి శివారు వైపు వెళ్లి గుర్తుతెలియని రైలు కిందపడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మంగళవారం మృతదేహానికి పంచనామా అనంతరం పోస్టుమార్గం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఏరియాస్పత్రికి తరలించారు. ఆ తర్వాత కుటుంబ సభ్యులకు అప్పగించారు. తల్లి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

అప్పుల బాధతో ఒకరు..

దస్తురాబాద్: అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై శంకర్ కథనం ప్రకారం.. మండలంలోని గోడిసీర్యాల గోండుగూడ గ్రామానికి చెందిన నామెల్లిపురుక జగన్ (45), రాధ దంపతులు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె సంతానం. వ్యవసాయం చేసుకుని జీవిస్తున్నారు. ఆయనకున్న ఎకరం భూమిలో పంట సాగు చేస్తున్నాడు. కొన్నేళ్ల క్రితం జగన్ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో పలువురి వద్ద చేసిన అప్పులు చేసి మద్యం తాగేవాడు. అప్పలు తీర్చే మార్గం లేకపోవడంతో మంగళవారం ఇంట్లో గుర్తుతెలియని పురుగుల మందు తాగాడు. ఆ సమయంలో భార్య రాధ పక్కింట్లోకి వెళ్లి తిరిగివచ్చింది. అప్పటికే పురుగుల మందు తాగిన జగన్ భార్యతో మాట్లాడుతున్నాడు. ఆ సమయంలో నోట్లో నుంచి నురుగులు కక్కడంతో 108 సిబ్బందికి సమాచారం అందించింది. వారు అక్కడికి చేరుకుని ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు గమనించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్గం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. తర్వాత కుటుంబ సభ్యులకు అప్పగించారు. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలో ఓ ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఏఎస్సై రాములు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంద్రవెల్లి మండలం గిన్నెర గ్రామానికి చెందిన అంకిత ఉట్నూర్‌లోని ఓ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. స్థానిక గోపాయి చెరువుకట్ట వద్ద పురుగుల మందు తాగి సాయంత్రం అపస్మారక స్థితిలో పడి ఉంది. అటుగా వెళ్లిన వారు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు యువతిని వెంటనే ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. కాగా, యువతి వద్ద 'డాడి ఐయామ్ సారి' అని ఓ లెటర్ లభించినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

బజార్‌హత్నూర్: మండలంలోని అనంతపూర్‌లో సోమవారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో కోరెంగ హన్మంతు ఇల్లు దగ్ధమైంది. విద్యుత్ వైరు తెగి ఇంటిపై కప్పుపై పడటంతో మంటలు చెలరేగాయి. కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో గ్రామస్తులు వచ్చి మంటలార్పేందుకు యత్నించారు. ఇచ్చోడ నుంచి ఫైరింజన్ అక్కడికి చేరుకుని మంటలార్పివేసింది. తహసీల్దార్ శ్యాంసుందర్ ఆదేశాలతో మంగళవారం ఎంఆర్ఐ నూర్‌సింగ్ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదంలో రూ.2.50 లక్షల నగదు, 3.5 తులాల బంగారం, 50 తులాల వెండి, టీవీ, కూలర్, సోఫాసెట్, బెడ్స్, జొన్నలు, గోధుమ పంట, కందులు, బియ్యం, సర్టిఫికెట్లు కాలిపోయాయి. సుమారు రూ. 17 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ సోయం బాపురావ్ అక్కడికి చేరుకుని పరిశీలించి బాధిత కుటుంబానికి రూ.20 వేలు అందించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.